క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సాయికుమార్

హిరమండలం: గర్భిణులు పౌష్టికాహారం, చిరుధాన్యాలు తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటుందని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికుమార్ అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదికర్మ యోగిపై అవగాహన

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆది కర్మయోగి కార్యక్రమంపై మండలంలోని మహసింగి గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అందని కుటుంబాలను సర్వే చేయాలని వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు అన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందేలా యువతీ, యువకులు పని చేయాలని కోరారు. తాగునీరు, విద్య, వైద్యం ప్రజలకు అందేలా కృషి చేయాలన్నారు. రహదారుల నిర్మాణాల కోసం అధికారులతో మట్లాడి నిధులు మంజూరు చేయించుకోవాలన్నారు. కొత్తూరు, భామిని, సీతంపేట, హిరమండలం , తదితర మండలాలకు చెందిన యువతీ, యువకులు హాజరయ్యారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ క్రాంతి కుమార్, ఏరియా కో ఆర్డినేటర్ ఎం.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..


రాజేశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: మండల కేంద్రంలోని కోటగుడి కాలనీలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ పెద్దమ్మ దమరసింగి రాజేశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ప్రదీప్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం పరామర్శించారు. రాజేశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పెద్దలోగిడి గ్రామానికి చెందిన బైపోతు అప్పలరాజు ఇటీవల మృతి చెందారు. అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగుతల సూర్యం, నాయకులు పనుకు మోహన్, గోకవలస రాము, దువ్వాడ జోగారావు, టంకాల సుధాకర్, తదితరులు ఉన్నారు.

కొండచిలువ హతం


హతమైన కొండచిలువ

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం గిరిజన గ్రామంలో 6 అడుగుల కొండచిలువను గ్రామస్తులు గురువారం హతమార్చారు. గ్రామంలోని ఒక వీధిలో కొండచిలువ కోడిని పట్టుకుని మింగడానికి ప్రయత్నిస్తుండగా, గ్రామస్తులు కర్రలతో కొట్టారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమదాలవలస: ప్రత్యేకావసరాల గల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు డాక్టర్ ఎస్.శశిభూషణ్ అన్నారు. గురువారం పట్టణంలోని గేటు మున్సిపల్ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ప్రత్యేకావసరాల పిల్లల పరికరాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాన్పూర్‌కు చెందిన అలింకో సంస్థ, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహించాయన్నారు. అలింకో ప్రతినిధులు డాక్టర్ రంజాన్, అజిత్ ప్రత్యేకావసరాల పిల్లలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వెంకటరావు, జిల్లా సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు, సహ సమన్వయకర్త వి.ఉమ, ఎంఈఓలు టి.రాజు, బి.ధనుంజయరావు, కె.శ్రీనివాసరావు, పి.రాజారావు, హెచ్‌ఎం వై.లత తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి..!

- చెరువులను తలపిస్తున్న రహదారులు
- నరకయాతన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


కొత్తూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద ఏబీ రోడ్డు దుస్థితి


కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద చెరువును తలపిస్తున్న పీహెచ్ రోడ్డు


నివగాంలోని పట్నాల వీధి వద్ద చెరువును తలపిస్తున్న పీహెచ్ రోడ్డు

కొత్తూరు: అడుగుకో గొయ్యి.. చెరువులను తలపిస్తున్న రహదారులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. కూటమి నాయకులు చెప్పిన మాటలకు.. వారి చేతలకు అసలు పొంతనే ఉండడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. ఇంతవరకు రహదారుల్లో ఏర్పడిన గుంతలను చాలాచోట్ల పూడ్చలేదు. కొత్తూరు నుంచి ఒడిశాకు వెళ్లే పాలకొండ-హడ్డుబంగి, అలికాం-బత్తిలి రహదారుల్లో అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. కొత్తూరులోని అలికాం-బత్తిలి రోడ్డులో ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద అడుగుకో గొయ్యి ఏర్పడింది. ఈ గోతుల్లో వాహనాలు దిగబడిపోతున్నాయి. పాలకొండ-హడ్డుబంగి రోడ్డులో నివగాం గ్రామం పట్నాల వీధి వద్ద చెరువును తలపిస్తోంది. ఇదే రోడ్డులో కొత్తూరులోని నాలుగు రోడ్లకు సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షం కురిస్తే ఈ రోడ్డు పూర్తిగా నీటితో నిండిపోతోంది. రోడ్డు కనిపించకపోవడంతో వాహనదారులు ఎటు వైపు వెళ్లాలన్నది తెలియక ప్రమాదాల బారీన పడుతున్నారు. బత్తిలి రోడ్డులో పండ్ల దుకాణాల వద్ద రోడ్డుపై నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో చెరువును తలపిస్తోంది. గతేడాది సంక్రాంతి నాటికే రహదారులను అద్దాల్లా తయారు చేస్తామని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనలకు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు అసలు పొంతనే ఉండడం లేదు.

గోతులు పూడ్చాలి..



నిత్యం రద్దీగా ఉన్న రహదారుల్లో భారీ గోతులు ఏర్పడడంతో నరకాన్ని చూస్తున్నాం. వాహనాలు వస్తే ఎటువైపు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. గోతుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గోతులు పూడ్చాలి.

– ఊద గోవిందరావు, పారాపురం, కొత్తూరు మండలం

ప్రయాణం ప్రమాదకరం



ప్రధాన రహదారుల్లో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. భారీగా ఏర్పడిన గోతుల్లో దిగబడి ఆటోలు పాడవుతున్నాయి.

– జి.నీలంనాయుడు, ఆటో డ్రైవర్, కుంటిభద్ర, కొత్తూరు మండలం

వర్షాలు తగ్గితే పనులు చేయిస్తాం..

వర్షాలు కురుస్తున్నందున గోతులు పూడ్చడానికి అవకాశం ఉండడం లేదు. వర్షాలు తగ్గిన వెంటనే రహదారుల్లో ఏర్పడిన గోతులను పూడ్చడం జరుగుతుంది. పనులు చేసేందుకు నిధులున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఎత్తు చేయడం వలన చాలాచోట్ల పాడవుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తులను యంత్రాలతో తొలగిస్తాం.

– గోపాలరావు, జేఈఈ, ఆర్అండ్‌బీ, కొత్తూరు మండలం

కార్యకర్తలే పార్టీకి బలం


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- 15 నెలల్లోనే కూటమి పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో పాతపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలు, మహిళలు, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉన్న ఒకే ఒక్క పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. కూటమి పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారన్నారు. రెండు, మూడు పథకాలు అమలు చేసినా అనేక కొర్రీలతో లబ్ధిదారుల సంఖ్యను కుదించారని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 15 నెలల కూటమి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులకు యూరియా ఇవ్వలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. కూటమి నాయకులకు అధికార దాహం తప్ప.. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన లేదన్నారు. ప్రజలకు మంచి జరిగేంత వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు, దాడులకు దిగుతుండడం సిగ్గుచేటన్నారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతి, ఎంపీపీ సవర సావిత్రమ్మ, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ, గండివలస ఆనంద్, పోలాకి జయమునిరావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి జి.యోగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సాంబమూర్తి, రెడ్డి రామారావు, బైపోతు ఉదయ్‌కుమార్, ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, చింతాడ సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, కొల్లి కృష్ణ, యరుకోల వెంకటరమణ, లింగాల సంజీవరావు, లూకలాపు ప్రసాద్, శశిభూషణరావు, వంగపల్లి చిన్నారావు, గోకవలస రాము, చల్లా రవి, పల్లి యోగి, డి.రామారావు, ఇప్పిలి నారాయణరావు, పనుకు మోహన్, తూలుగు ప్రవీణ్, సవర సుసీక, మామిడి గంగాధర్, దకర చిన్నారావు, బెనియా వెంకటరమణ, మీసాల రామారావు, నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రంగారావు

ఆమదాలవలస: ఆమదాలవలస రోటరీ క్లబ్ టౌన్ లిటరసీ మంత్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వర్డ్ బిల్డింగ్, స్పెల్-బి వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రొటేరియన్, పోలియో చైర్మన్ రంగారావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జాతీయ సేవా పథకం ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా ఎన్నికైన జలుమూరు రవిబాబును రంగారావు, రోటరీ క్లబ్ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ పెంచుకోవాలన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ వి.టి.చౌదరి, రోటరీ సెక్రెటరీ జె.వెంకటేశ్వరరావు, న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ బి.ఎ.స్వామి, జలుమూరు రవిబాబు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ సిల్లా రవి, సంజీవరావు మాస్టారు, అధ్యాపకులు ధవళ నారాయణరావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి


హిరమండలం: ఎల్.ఎన్.పేటలో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహంతి, తదితరులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ మండల అధ్యక్షుడు మహంతి హరి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ.. దీన్‌దయాళ్ ఆలోచనలు గ్రామాభివృద్ధికి మార్గదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో పండిట్ దీనదయాళ్ జయంతిని నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓ ట్యూషన్ సెంటర్లో దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. దినదయాళ్ జీవిత చరిత్ర గూర్చి బీజేవైఎం అధ్యక్షుడు రాము వివరించారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

తక్కువ వడ్డీకే రుణాల మంజూరు

ఆమదాలవలస: తక్కువ వడ్డీకే వీధి, చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేస్తున్నామని మెప్మా పీడీ ఎస్.వెంకటరావు అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో లోక్ కళ్యాణ మేళాను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల సంక్షేమానికి అమలు చేస్తున్న లోక్ కళ్యాణ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీధి వ్యాపారులను వెండింగ్ జోన్లుగా విభజించి, వారికి కేటాయించిన ప్రదేశాల్లోనే వ్యాపారం చేసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి యోజన కింద బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నారన్నారు. వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.రవికుమార్, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ పి.కామేశ్వరరావు, డీసీసీబీ మేనేజర్ మురళీధర్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ డి.సురేష్, టీఎంసీ ఎస్.వి.రత్నం, సీఓలు నాగమణి, వినోద్, ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

హిరమండలం: మండలంలోని గులుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని తొత్తడి ప్రవల్లికను ఎంఈఓలు కె.రాంబాబు, దాలయ్య, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ నెల 20వ తేదీన డివిజనల్ స్థాయిలో టెక్కలి నిర్వహించిన సేవ్ గర్ల్-చైల్డ్ నార్మ్ అనే అంశంపై వక్తృత్వ పోటీల్లో ప్రవల్లిక ద్వితీయ స్థానం సాధించిందని ఎంఈఓ రాంబాబు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి


హిరమండలం: ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు


బూర్జ: ఎంపీడీఓ కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు


పొందూరు: పార్కులో శ్రమదానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


పాతపట్నం: పాతపట్నం సీహెచ్‌సీ ఆవరణంను శుభ్రం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులను శుభ్రం చేశారు. పలు శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

తాగునీరు వృథా..!



సారవకోట మండల కేంద్రంలోని రక్షిత మంచినీటి పథకం పైపులైన్ గత కొంత కాలంగా లీకు అవుతోంది. ప్రధాన ట్యాంక్ నుంచి గ్రామంలోని వీధులకు వెళ్లే పైపులైన్ నాయుడు వీధి సమీపంలో లీకు కావడంతో నీరు వృథాగా పోతుంది. కుళాయిలకు నీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతోంది. దీనిపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. – సారవకోట

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రహదారిలో గుబురుగా పెరిగిన పొదలు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – సరుబుజ్జిలి

షెడ్ కాదు..



సారవకోట మండలంలోని కేశవలస పంచాయతీలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు ఆ అసంపూర్తి భవనంలో కర్రలు భద్రపర్చుకోవడం, వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ పంచాయతీలో సచివాలయం సేవలు రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనానికి ఆనుకుని ఈ అసంపూర్తి భవనం ఉంది. అసంపూర్తి భవానాన్ని ప్రైవేట్ వ్యక్తులు వినియోగిస్తున్నా.. సచివాలయ సిబ్బంది పట్టించుకునే దాఖలాలు లేవు. – సారవకోట

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పొందూరు: మండలంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాపాక, పొందూరు, దళ్లవలస, కొంచాడ తదితర గ్రామాల్లో దుర్గాదేవికి గురువారం కుంకుమపూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలో దేవీ నవరాత్రులు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నరసన్నపేట, మడపాం, వీఎన్‌పురం, తోటాడ, దేవాది, మాకివలస, ఉర్లాంల్లో దుర్గాదేవికి గురువారం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉర్లాంలో కాత్యాయినిగా దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. నరసన్నపేటలోని కార్ స్టాండ్ వద్ద, వీఎన్పురంల్లో భవానీలు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సారవకోటలో..

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి దుర్గ ఆలయంలో అమ్మవారిని గురువారం లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రత్యేకంగా అలంకరించి భవానీ భక్తులు పూజలు చేశారు.


నరసన్నపేట: భవానీ కార్ స్టాండ్ వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు


సారవకోట: పూజల్లో పాల్గొన్న భవానీ భక్తులు


పొందూరు: రాపాకలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నరసన్నపేట: వీఎన్ పురంలో పూజలు చేస్తున్న భవానీలు, మహిళలు


నరసన్నపేట: ఉర్లాంలో కాత్యాయినిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి